సాక్షి
విజయనగరం
గురువారం । 4 । ఏప్రిల్ । 2024



మళ్లీ వచ్చేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే - 8లో
రాష్ట్రంలో మళ్లీ ఏర్పడేది జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమేనని మంత్రి బొత్స అన్నారు.



అంబరాన్నంటిన సిరిమాను సంబరం - 8లో
కొట్టాంలో వెలసిన కోటమ్మ తల్లి సిరిమాను సంబరం అంబరాన్ని తాకింది.

ఇఫ్తార్	సహర్
గురు (సా॥)	శుక్ర (ఉ॥)
6.15	4.26

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

జగనాభిమానం

- జగన్ సీఎం కావాలంటూ వృద్ధుడు నిత్య పూజలు



జగన్ మళ్లీ సీఎం కావాలంటూ పూజలు చేస్తున్న వృద్ధుడు అప్పలనాయుడు

నెల్లిమర్ల రూరల్: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి సాగిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పాలనకు ఓ వృద్ధుడు ఫిదా అయ్యాడు. ఏకంగా తన గుండెలోనే జగన్‌కు గుడికట్టాడు. జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎం కావాలంటూ ఇంటిలో నిత్యపూజలు చేస్తున్నాడు. ఆయనే.. నెల్లిమర్ల మండలంలోని వల్లూరు గ్రామానికి చెందిన 86 ఏళ్ల వృద్ధుడు అంబళ్ల అప్పలనాయుడు. ఆయన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డికి వీరాభిమాని. ఇంట్లో దేవుడి ఫొటోలు పక్కనే వైఎస్సార్ ఫొటోలు పెడుతూ నిత్యం ఆరాధిస్తుంటాడు. 2019లో జగన్ సీఎం కావాలని 101 రోజులు తన నివాసంలో పూజలు చేశాడు. తాజాగా ఇప్పుడు కూడా అదే సెంటిమెంట్‌ను కొనసాగిస్తున్నాడు. నెల్లిమర్లలో ఎమ్మెల్యేగా మళ్లీ బడ్డుకొండ అప్పలనాయుడు గెలవాలని, రాష్ట్ర ముఖ్యమంత్రిగా వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి గెలిచి రావాలని దేవుడి గదిలో నిత్యం ప్రార్థనలు చేస్తూ తన అభిమానాన్ని చాటుకుంటున్నాడు. జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో ప్రజలకు ఏ కష్టం, నష్టం రాకుండా చూసుకున్నారని, మళ్లీ రాష్ట్రానికి ఆయన సీఎం కావాలని సమస్త దేవతామూర్తులకు పూజలు చేస్తున్నట్టు వృద్ధుడు తెలిపాడు. కరోనా లాంటి సమయంలో ప్రజల పాలిట ఆపద్బాంధుడిగా జగన్ నిలిచినట్టు పేర్కొన్నాడు.

వెంకటరాజపురంలో ఏనుగుల సంచారం



వెంకటరాజపురం పరిసరాల్లో సంచరిస్తున్న ఏనుగులు

జియ్యమ్మవలస: మండలంలోని వెంకటరాజపురం, బట్లబద్ర, బిత్రపాడు, గవరమ్మపేట పరిసర ప్రాంతాల్లో ఏనుగుల గుంపు బుధవారం సంచరించింది. పామాయిల్, అరటి, వరి పొలాల్లో తిరుగుతూ పంటలను ధ్వంసం చేస్తున్నాయి. రాత్రి సమయాన వెంకటరాజపురం పరిసర ప్రాంతాల్లోని పామాయిల్ తోటలో తిష్టవేయడంతో గ్రామస్తులు భయాందోళనలు చెందుతున్నారు. పంట పొలాలకు వెళ్లే రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని అటవీశాఖ అధికారులు హెచ్చరికలు జారీచేశారు. వీలున్నంత వరకు రాత్రి సమయాన పంటపొలాలకు వెళ్లవద్దని కోరారు.

నమ్మించి.. మోసం చేస్తే ఊరుకోం

- పాలకొండ నియోజకవర్గ జనసేన సమన్వయకర్త నిబ్బరం

పాలకొండ రూరల్: జనసేన పార్టీ బలోపేతానికి కష్టపడి పనిచేశామని, నమ్మించి మోసం చేస్తే ఊరుకునేది లేదని ఆ పార్టీ పాలకొండ నియోజకవర్గ సమన్వయకర్త నిమ్మల నిబ్బరం స్పష్టంచేశారు. పాలకొండలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జనసేన పార్టీ సభ్యత్వాల స్వీకరణ, ఊరూరా ప్రచారంలో ముందుండడంతో టికెట్ కేటాయిస్తామని పవన్‌కళ్యాణ్ మాట ఇచ్చారని, ఇప్పుడు పొత్తుల పేరుతో వంచనకు గురిచేసేందుకు ప్రయత్నించడం తగదన్నారు. ఎటువంటి సమాచారం లేకుండా టీడీపీ నుంచి వరుగా ఓటమి చెందిన ఆ పార్టీ పాలకొండ ఇన్‌చార్జిని జనసేనలోకి ఆహ్వానించడం విచారకరమన్నారు.

పింఛన్ పాట్లు!



పింఛన్ కోసం జొన్నవలస సచివాలయం మెట్లు ఎక్కేందుకు వృద్ధురాలు ఆదిలక్ష్మి పాట్లు



- **తప్పని నిరీక్షణ**

చిత్రంలో కనిపిస్తున్నది బాడంగి సచివాలయం వద్ద నిరీక్షిస్తున్న పింఛన్ దారులు. పింఛన్లు ఇస్తున్నారన్న సమాచారంతో సచివాలయం వద్దకు చేరుకున్నారు. అక్కడ గంటల తరబడి నిరీక్షించారు. ఈ రోజు పింఛన్లు పంపిణీ లేదని సచివాలయ సిబ్బంది చెప్పేసరికి నిరాశతో వెనుదిరిగారు. ఐదేళ్లుగా ప్రతినెలా ఒకటో తేదీన ఠంచన్‌గా ఇంటివద్దనే వలంటీరు పింఛన్ అందజేసేవారని, మాయదారి చంద్రబాబు, అండ్ కో ఇచ్చిన ఫిర్యాదుతో తమకు కష్టాలు తప్పడంలేదంటూ వాపోయారు. - బాడంగి



- **పింఛన్ కోసం క్యూ..**

సుమారు 58 నెలల జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాలనలో పింఛన్ కోసం ఏ సచివాలయం వద్ద అయినా ఒక్క లబ్ధిదారైనా మచ్చుకైనా కనిపించారా అంటే.. లేదనే సమాధానం వస్తుంది. కానీ ఎన్నికల వేళ చంద్రబాబు స్వార్థరాజకీయాల వల్ల వలంటీర్ల సేవలకు బ్రేక్ పడింది. పింఛన్‌దారులకు కష్టాలు మొదలయ్యాయి. దీనికి వంగర సచివాలయం వద్ద బుధవారం పింఛన్ డబ్బుల కోసం బారులు తీరిన లబ్ధిదారుల చిత్రమే నిదర్శనం. - వంగర

- మళ్లీ సచివాలయాల వద్ద పడిగాపులు
- ఇప్పుడు కడుపు నిండిందా చంద్రబాబూ..
- అభాగ్యుల ఆసరాతో ఆటలాడుకున్న 'పచ్చ' దండు
- నెలవారీ అవసరాలకు.. మందులకు అవస్థలు పడుతున్న పండుటాకులు
- పింఛన్‌దారులకు మళ్లీ టీడీపీ కాలం నాటి అవస్థలే
- వేకువజామున 6 గంటలకే సచివాలయాల వద్ద పడిగాపులు
- జిల్లాలో ప్రారంభమైన సామాజిక పింఛన్ల పంపిణీ
- కొన్ని ప్రత్యేక వర్గాలకే ఇంటి వద్ద..

"'మాకు ఏ చిన్న సమస్య వచ్చినా మేమున్నామంటూ వలంటీర్లు ముందుకొచ్చేవారు. ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు, పథకాలు అందించేవారు. పింఛన్లు ప్రతినెలా ఒకటో తేదీనే ఇచ్చేవారు.. ఇప్పుడు వారితో పింఛన్లు పంపిణీ చేయకుండా చంద్రబాబు అండ్ కో చేసిందట.. చంద్రబాబుకు మా మీద ఇంతటి కోపమెందుకు..? ఆయనకు మా ఉసురు తప్పకుండా తగులుతుంది...'
- రచ్చబండలపై కూర్చొని పింఛన్‌దారులు పెడుతున్న శాపనార్థాలు ఇవి..

"'జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక ఒకటో తేదీన ఆరు గంటలకే ప్రతి నెలా క్రమం తప్పకుండా పింఛన్ అందేది. ఆ డబ్బులతోనే ఇంటికి సరిపడా నిత్యావసర సరకులు ఒకేసారి తెచ్చుకునేదాన్ని. మిగతా చిన్నచిన్న పనులు చేసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొచ్చేదాన్ని. టీడీపీ వారు చేసిన చిల్లర రాజకీయం వల్ల ఈ నెల పింఛన్ డబ్బులు ఆలస్యమయ్యాయి. చేతిలో డబ్బులు లేక సరకులు తెచ్చుకోలేకపోతున్నా.
- ఇదీ. ఓ వితంతువు వ్యథ



జొన్నవలస సచివాలయంలో పింఛన్ కోసం క్యూ కట్టిన వృద్ధులు

"'ప్రతి నెలా ఒకటో తేదీన ఉదయం కాగానే పింఛన్ డబ్బులు చేతికొచ్చేవి బాబూ.. వయసైపోయింది. శరీరం మునుపటిలా సహకరించదు. నా మందుల ఖర్చే నెలకు రూ.1,500 అవుతోంది. డబ్బులు రాగానే నెలకు సరిపడా మందులు ఒకేసారి తెచ్చేసుకుంటా. మిగతా రూ.1,500 చిన్నచిన్న అవసరాల కోసం ఎవరి మీదా ఆధారపడకుండా, కుటుంబానికి భారం కాకుండా పనికొచ్చేవి. ఇప్పుడు మూడో తేదీ వచ్చినా రాలేదు. మందులు అయిపోయాయి. రెండు రోజులుగా ఇబ్బందిగా ఉంది. ఈ రోజే సచివాలయానికి వెళ్లి తెచ్చుకోవాలని చెప్పారు. వలంటీరు తెచ్చి ఇవ్వకూడదంట కదా. టీడీపీ వారి వల్లే మాకు ఈ కష్టాలు. మా పింఛన్ డబ్బులు ఎవరు తెచ్చి ఇస్తే వారికెందుకు. మేం చల్లగా ఉండటం ఇష్టం లేదా?''
- ఇదీ.. ఓ వృద్ధురాలి ఆవేదన

విజయనగరం అర్బన్/విజయనగరం రూరల్:

ప్రతీ నెల ఒకటో తేదీన తెల్లారక ముందే ఇంటి వద్దే చేతికందుతున్న పింఛన్ సొమ్ములు చూసి మురిసిపోయిన అవ్వాతాతలకు మళ్లీ పాతరోజులు గుర్తుకొచ్చాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన అరకొర పింఛన్ ఎప్పుడు వస్తుందో తెలిసేది కాదు. ఒక్కోసారి వారం రోజులకు పైగా ఎదురుచూపులు చూడాల్సి వచ్చేది. దివ్యాంగులు, వయస్సుపైబడిన వారు, రోగులు పింఛన్ డబ్బులకు పంచాయతీ కార్యాలయాల వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చేది. వలంటీర్ల సేవలను అడ్డుకొని చంద్రబాబు మళ్లీ ఆ రోజులు తీసుకొచ్చారు. ఎన్నిక సంఘం ఆదేశాల మేరకు వలంటీర్లు లేకుండా ప్రభుత్వం చేపట్టిన ప్రత్యామ్నాయ చర్యల్లో భాగంగా బుధవారం మధ్యాహ్నం నుంచి సచివాలయాల్లో పింఛన్ల పంపిణీ ప్రారంభమైంది. రెండు రోజులు ఆలస్యంగానైనా పింఛన్ డబ్బులు అందుతాయన్న ఆతృతతో సచివాలయాల వద్దకు లబ్ధిదారులు చేరుకున్నారు. గంటల తరబడి క్యూలో నిల్చొని ఇబ్బందులు పడ్డారు. తమను అష్టకష్టాలు పాల్జేస్తున్న టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుకు శాపనార్థాలు పెట్టారు. చంద్రబాబుకు ఓటేస్తే పాత రోజులు వస్తాయని, కార్యాలయాల చుట్టూ తిప్పడమే కాకుండా వచ్చిన పింఛన్ డబ్బులు దోచేస్తాడని మండిపడ్డారు.

- **జగన్ పాలనలో తెల్లవారుజామునే పంపిణీ...**

అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛన్ కోసం లబ్ధిదారుల ఎదురుచూపునకు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి చెక్ పెట్టారు. జిల్లాలో 635 సచివాలయాల్లో 10,505 మంది వలంటీర్లతో ప్రతినెలా 1వ తేదీనే సూర్యోదయానికి ముందే లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛన్ డబ్బులు అందజేసేవారు. కరోనా వంటి సమయంలోనూ ఠంచన్‌గా పింఛన్ పంపిణీ చేశారు. ప్రస్తుతం జిల్లాలో 2,83,773 మంది పింఛన్ లబ్ధిదారులకు ప్రభుత్వం ప్రతినెలా రూ.82.94 కోట్ల సాయం అందిస్తోంది. బుధవారం కేవలం 88 వేల మందికే పింఛన్ డబ్బులు అందాయి. దానికి గంటల తరబడి సచివాలయాల వద్ద వేచి ఉండాల్సి వచ్చింది. దివ్యాంగులు, వయోవృద్ధులు, మంచానికే పరిమితమైన వారు, కిడ్నీ పేషెంట్లకు ఇంటివద్దకు సచివాలయ సిబ్బంది వచ్చి పింఛన్లు అందజేయనున్నారు.

మాలాంటి వారితో ఆటలా..



చంద్రబాబూ.. నీకు ఇదేం దుష్టబుద్ధి. మా లాంటి అభాగ్యులకు వలంటీర్లే దిక్కు. వారిని చూస్తేనే మాకు ఒక ధైర్యం. ప్రతినెలా ఒకటో తేదీనే వచ్చి పింఛన్ డబ్బులు ఇచ్చేవారు. ఏ కష్టమొచ్చినా మేమున్నామంటూ ముందుండేవారు. వారి సేవలను దూరం చేసిన నీకు ప్రజలను పాలించే హక్కు లేదు. నీకు పొరపాటున ఓటేస్తే మళ్లీ మమ్మలను అష్టకష్టాల పాలచేస్తావు. ఎండల్లో తిప్పుతావు. నీకు తగిన బుద్ధిచెబుతాం.
- పిల్లా ఆదిలక్ష్మి, జొన్నవలస

- **వ్యయప్రయాసలు...**



ఈ చిత్రంలో కనిపిస్తున్న వృద్ధురాలు కునుకు సన్యాసమ్మది విజయనగరం మండలం జొన్నవలస గ్రామ సచివాలయ పరిధిలోని బంగారమ్మ కాలనీ. ఒక్క మనవరాలు తప్ప నా అన్నవారు ఎవరూ లేని బడుగు జీవి. ఆమెకు పింఛన్ డబ్బులే జీవనాధారం. చంద్రబాబు అండ్ కో ఫిర్యాదుతో ఆమెకు పింఛన్ అందలేదు. సచివాలయం వద్ద బుధవారం పింఛన్ ఇస్తున్నారని తెలుసుకుని ఆటోకు రూ.100 చార్జీ చెల్లించి మనువరాలి సాయంతో చేరుకుంది. రాజకీయాలు ఉంటే నాయకులు చూసుకోవాలే గాని వృద్ధులు, బడుగులపై చంద్రబాబుకు కక్షెందుకు అంటూ ఆమె వాపోయింది. మాలాంటి వృద్ధుల ఉసురు తగులుతుందని శాపనార్థాలు పెట్టింది.

- **ఇదేందయ్యా ఇలా...**



మాకు వలంటీర్లు ఇంటికొచ్చి పింఛన్ ఇస్తే చంద్రబాబుకు ఏం నొప్పయ్యా... మమ్మలను సచివాలయాలకు తిప్పిస్తున్న ఆయనకు ఎలా మంచి జరుగుతుందయ్యా అంటూ విజయనగరం ఎంపీపీ మామిడి అప్పలనాయుడు వద్ద పలువురు పింఛన్‌దారులు వాపోయారు. గుంకలాం, జొన్నవలస, రాకోడు గ్రామాల్లో పర్యటించిన ఆయన వద్ద అవ్వా, తాతలు పింఛన్ కష్టాలను ఏకరవు పెట్టారు. చంద్రబాబునాయుడు స్వార్థంతో ఈ పరిస్థితి వచ్చిందని, రెండు నెలల్లో అన్ని సర్దుకుంటాయని వారిని ఆయన ఓదార్చారు.

దివ్యాంగులను కించపరిచేలా మాట్లాడొద్దు

- పిల్లలను ఎన్నికల కార్యక్రమాల్లో వినియోగించకూడదు
- రాజకీయ పార్టీల సమావేశంలో కలెక్టర్ నాగలక్ష్మి



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: ఎన్నికల నిబంధనల ప్రకారం ఎన్నికల ప్రచారంలో విభిన్న ప్రతిభావంతులను కించపరిచే పదాలను రాజకీయ నాయకులు పలుకరాదని కలెక్టర్ నాగలక్ష్మి అన్నారు. కుంటి ప్రభుత్వం, గుడ్డి ప్రభుత్వం లాంటి పదాలను వాడడం వల్ల దివ్యాంగుల మనోస్థైర్యం దెబ్బతింటుందన్నారు. కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఓటర్ల జాబితా సవరణ తీరును ముందుగా వివరించారు. జాబితా ప్రకటించిన తరువాత, ఇప్పటి వరకు జిల్లాలో సుమారు 10 వేల కొత్త ఓటర్లను చేర్చామన్నారు. కొత్త ఓటర్లు ఓటు కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 14 వరకు అవకాశం ఉందన్నారు. ఇప్పుడు కేవలం ఓట్ల చేర్పింపు మాత్రమే జరుగుతుందని మిగిలిన వాటికి అవకాశం లేదని స్పష్టంచేశారు. 18 ఏళ్లలోపు బాల బాలికలను రాజకీయ కార్యకలాపాల్లో వినియోగించకూడదని చెప్పారు. పార్టీల ప్రచారం, పాంప్లెట్లు, జెండాల పంపిణీ, ర్యాలీలు, నినాదాలు ఇవ్వడంతో పాటు, రాజకీయపార్టీలు ప్రదర్శించే సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా పిల్లలను వినియోగించకూడదని స్పష్టం చేశారు. ప్రభుత్వ స్థలాలు, కార్యాలయాల్లో ఉన్న హోర్డింగులను రాజకీయ పార్టీల ప్రచారానికి కేటాయించబోమని తెలిపారు. ప్రైవేటు భవనాలు, ఇళ్లలో ఇక స్టిక్కర్, చిన్నపాటి జెండా లేదా బ్యానర్‌ను పెట్టుకోవచ్చని, అయితే ఆ ఇంటి యజమాని నుంచి అనుమతి పత్రం తీసుకొని 3 రోజుల్లో సమర్పించాలని సూచించారు. ప్రస్తుతం రాజకీయ పార్టీలు చేసే వ్యయం అంతా పార్టీ ఖాతాలోకి వెళ్తుందని, నామినేషన్ దాఖలు చేసిన తరువాత అభ్యర్థి ఖాతాలో లెక్కిస్తారని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డీఆర్‌ఓ ఎస్.డి.అనిత, వివిధ నియోజకవర్గాల ఆర్వోలు, నోడల్ ఆఫీసర్లు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

డబ్బుతో ప్రజలను కొనాలని చూస్తున్న టీడీపీ

- ఎక్కడెక్కడి నుంచో వ్యాపారానికి వచ్చినట్టు టీడీపీ అభ్యర్థులు వస్తారు
- చెప్పినవన్నీ చేశాం కాబట్టే ధైర్యంగా ఓట్లు అడుగుతున్నాం
- టీడీపీ ఏం చేసిందో గ్రామాల్లోకి వచ్చినప్పుడు అడగండి
- రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ



ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

చీపురుపల్లి: తెలుగుదేశం పార్టీ రానున్న ఎన్నికల్లో ప్రజలను డబ్బుతో కొనుగోలు చేయాలని చూస్తోందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఆరోపించారు. చీపురుపల్లి మండలం కరకాం గ్రామంలో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి అభివృద్ధి, సంక్షేమం చేయడం చేతకాదని, ఎన్నికల వచ్చినప్పుడు ఓటర్లను డబ్బుతో కొనుగోలు చేయవచ్చననే ధీమాతో ఉంటారని అన్నారు. ప్రజలకు అభివృద్ధి కావాలో, ఓట్లు కోసం ఇచ్చే తాత్కాలిక డబ్బు కావాలో ఆలోచన చేసుకోవాలన్నారు. డబ్బుల కోసం ఓట్లు వేస్తే ప్రజల భవిష్యత్తు నాశనం అవుతుందన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థతో పైసా లంచం లేకుండా సంక్షేమ పథకాలు అమలు చేస్తే... వలంటీర్లను టెర్రరిస్టులుగా ముద్ర వేసిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. చంద్రబాబు నాయుడు దుర్మార్గపు ఆలోచనతో వలంటీర్లపై ఎన్నికల కమిషన్ ఫిర్యాదుచేసి పింఛన్ లబ్ధిదారులను ఇక్కట్లకు గురిచేశారన్నారు. జగన్ మోహన్‌రెడ్డి చెప్పిన ప్రతి మాట అమలు చేశారని, అందుకే ప్రజల ముందుకు వచ్చి ధైర్యంగా ఓటు అడగగలుగుతున్నామని చెప్పారు. టీడీపీ హయాంలో ఎలాంటి అభివృద్ధి చేశారో ప్రజలు ఆలోచన చేసుకోవాలన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రతి ఇంటికి మేలు జరిగిందని భావిస్తేనే ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ గతంలో 600 అబద్ధపు హామీలు ఇచ్చి మోసం చేసిన చంద్రబాబు ఏ ముఖం పెట్టుకొని మళ్లీ ఓట్లు అడగడానికి ప్రజల ముందుక వస్తాడని ప్రశ్నించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదల ఆరోగ్యం కోసం రూ.5 లక్షల వరకు పరిధి ఉన్న ఆరోగ్య శ్రీ పథకాన్ని రూ.25 లక్షలకు పెంచారని చెప్పారు. అవినీతి లేకుండా సంక్షేమ పథకాలు అమలు చేసి పేద ప్రజల పరపతిని పెంచారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ బెవర ఉమ, వైఎస్సార్ సీపీ మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసులనాయుడు, మీసాల వరహాల నాయుడు, బెల్లాన వంశీకృష్ణ , బెల్లాన త్రినాథరావు, గ్రామ నాయకులు సునీల్, తాడు, చంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

భక్తిభావంతో ప్రశాంత జీవనం



విగ్రహ ప్రతిష్ఠ కోసం పూజలు చేస్తున్న స్వరూపానందేంద్ర సరస్వతిస్వామి, శ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతి (ఇన్‌సెట్లో) ఆలయంలో నూతనంగా ప్రతిష్ఠించిన వెంకటేశ్వర స్వామి విగ్రహం

- శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామి
- ఎగువ కొండపర్తిలో వేంకటేశ్వర ఆలయ ప్రారంభోత్సవం

గంట్యాడ:

భక్తి భావంతో ప్రశాంత జీవనం సొంతమవుతుందని పెందుర్తి శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్రసరస్వతి స్వామి అన్నారు. గంట్యాడ మండలంలోని గిరిశిఖర గ్రామమైన ఎగువ కొండపర్తి గ్రామంలో సముద్ర మట్టానికి 3,333 అడుగల ఎత్తులో నూతనంగా నిర్మించిన వైకుంఠగిరి అనంత వేంకటేశ్వర స్వామి వారి ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠను స్వరూపానందేంద్ర సరస్వతి స్వామి, ఉత్తరాధికారి శ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతి జరిపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొండకోనల నడుమ ప్రశాంతమైన వాతావరణంలో స్వామివారి ఆలయం నిర్మించడం ఆనంద దాయకమన్నారు. ఇక్కడి వాతావరణం 3,200 అడుగల ఎత్తులో ఏడుకొండలపై వెలిసిన తిరుపతి వేంకటేశ్వరుని ఆలయాన్ని పోలి ఉందన్నారు. గిరిపుత్రులు నిత్యం వేంకటేశ్వర స్వామిని దర్శించుకునే భాగ్యం కలిగిందన్నారు.



అనంత వేంకటేశ్వర స్వామి ఆలయం

పూజలో ఆలయ ధర్మకర్త సముద్రారెడ్డి దంపతులు..

విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా ఉదయం నుంచే నిర్వహించిన పూజలు, యాగాల్లో ఆలయ ధర్మకర్త కర్రి సముద్రారెడ్డి, శ్రీవిద్య దంపతులు పాల్గొన్నారు. ఉదయం 6 గంటలకు సుప్రభాత సేవ, పారాయణ జరిపారు. ఉదయం 8 గంటలకు శ్రీ విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అష్టోత్తర కలశ స్నపనం, అభిషేకం, ప్రధాన కలశత్రయ మండలారాధన, హోమాలు జరిపారు. ఉదయం 9:14 నిమిషాలకు స్వామివారి విగ్రహప్రాణ ప్రతిష్ఠ జరిపారు. శ్రీపద్మావతి, శ్రీ గోదాదేవి (శ్రీ అండాల్) పన్నిద్రాళ్వార్, గరుడ, ధ్వజస్తంభ, బలిపీఠ వరాహ స్వామి, సంకల్ప, సిద్ధి శ్రీ మహాగణపతి స్వామి వార్ల యంత్ర స్థాపనలు, శిఖర, చక్రస్థాపన, విగ్రహ స్థాపనలు నిర్వహించారు.

క్లుప్తంగా

వ్యక్తి ఆత్మహత్య


ఆత్మహత్యకు పాల్పడిన వినయ్‌కుమార్

సాలూరు: పట్టణంలోని వడ్డీవీధికి చెందిన ఉల్లి వినయ్‌కుమార్ (35) ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై సీతారాం తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ, వడ్డీవీధికి చెందిన వినయ్‌కుమార్ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్ప డినట్లు ఆమె తల్లి లక్ష్మి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. వివరాలు తెలిశాక వెల్లడిస్తామన్నారు.

మృతుని వివరాలు లభ్యం

బొండపల్లి: మండలంలోని గరుడుబిల్లి గ్రామం వద్ద రేల్వేస్టేషన్ సమీపంలో మంగళవారం సాయంత్రం రైలు ఢీకొనడంతో గుర్తు తెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు బొబ్బిలి రైల్వే హెచ్‌సీ బి.ఈశ్వ్రరావు బుధవారం మాట్లాడుతూ మృతుడిని గజపతినగరం మండలంలోని సీతారాంపురం గ్రామానికి చెందిన గెద్ద తాతినాయుడు (37) గుర్తించినట్లు చెప్పారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు విజయనగరంలోని కేంద్ర సర్వజన ఆస్పత్రిలో మృతదేహాన్ని అప్పగించినట్లు తెలిపారు.

100 మద్యం సీసాల పట్టివేత

బాడంగి: మండలంలోని ఆనవరం గ్రామానికి చెందిన యామల శ్రీనివాసరావు ద్విచక్రవాహనంపై తరలిస్తున్న 100మద్యం సీసాలను ఎస్సై ఆర్.జయంతి, సిబ్బంది బుధవారం పట్టుకున్నారు. మల్లంపేట వైన్‌షాపులో సుమారు రూ.15వేల విలువైన మద్యం సీసాలను కొని ద్విచక్రవాహనంపై తన గ్రామానికి శ్రీనివాస రావు తరలిస్తుండగా సమీపంలోని మామిడితోట వద్దగల గ్రెవెల్ రోడ్డుపై కాపుకాసి పట్టుకున్నట్లు ఎస్సై జయంతి ఈ సందర్భంగా తెలిపారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

కోడి పందాల రాయుళ్ల అరెస్టు

బొండపల్లి: మండలంలోని గొల్లుపాలెం శివారులో కోడి పందాలు ఆడుతుండగా ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని అరెస్టు చేసినట్లు ఎస్సై కె.లక్ష్మణరావు తెలిపారు. ఈ సందర్భంగా నిందితుల దగ్గర 5 కోడి పుంజులతో పాటు, రూ.920 స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

9 మంది పేకాటరాయుళ్లు..

విజయనగరం క్రైమ్: వన్‌టౌన్ పరిధిలో గల ఓ ప్రైవేట్ హోటల్‌లో పేకాట ఆడుతున్న వారిపై స్పెషల్ బ్రాంచ్ పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా పేకాట ఆడుతున్న 9 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.లక్షా 8వేల 650, పది మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకుని, వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు.

బైక్, కారు ఢీకొని ఇద్దరికి గాయాలు

గరుగుబిల్లి: మండలంలోని ఎర్రన్నగుడి జంక్షన్ పరిధిలో మంగళవారం రాత్రి ద్విచక్ర వాహనం, కారు ఢీ కొన్న సంఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ మేరకు స్థానిక ఎస్సై అమ్మాన్ రావు బుధవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఖడ్గవలస జంక్షన్ నుంచి పార్వతీపురం వస్తున్న ద్విచక్రవాహనాన్ని పార్వతీపురం నుంచి గుమ్మలక్ష్మీపురం వైపు వెళ్తున్న కారు ప్రమాదవశాత్తు ఢీకొంది. ఈ ఘటనలో ద్విచక్రవాహనంపై వెళ్లా గాయాల పాలైన పార్వతీపురం పట్టణానికి చెందిన మర్రి దాలయ్య, ఎస్.ప్రదీప్‌లను జిల్లా ఆస్పత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందించారు. కారు నడిపిన ఎల్విన్‌పేటకు చెందిన నీలకంఠేశ్వరరావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మానవ జీవితానికి పునాది భగవద్గీత


భీష్మారావును సత్కరిస్తున్న ఆధ్యాత్మిక ప్రవచన కర్త అరుణ, తదితరులు

విజయనగరం టౌన్: మానవ జీవితానికి పునాది భగవద్గీతని విశాఖ నిష్కమ ఫౌండేషన్ ఆధ్యాత్మిక ప్రవచన కర్త అరుణ పేర్కొన్నారు. స్థానిక కొత్తపేట అనాసరపు వారి వీధిలో ఉన్న శ్రీమన్నార్ రాజగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక ప్రవచనం చివరిరోజు బుధవారం రాత్రి భగవద్గీతలోని పలు అంశాలను ప్రబోధించారు. భగవద్గీత మానవ జీవితాన్ని ప్రభావితం చేస్తున్న మహత్త్వముగా గుర్తించబడుతుందన్నారు. మానవ జీవితంలో పలు సమస్యలను పరిష్కరించేందుకు ఉపయోగపడుతుందన్నారు. అనంతరం శ్రీవారి స్వచ్ఛంద సేవా సంఘం వ్యవస్థాపకులు ఎమ్.భీష్మారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఆధ్యాత్మిక భక్తిగీతాలు ఆద్యంతం అలరించాయి. అనంతరం నిర్వహకులు ఆయన్ను దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎమ్.వంశీలక్ష్మి, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹135	₹240	₹ 250

మళ్లీ వచ్చేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే

- మండలస్థాయి సమావేశంలో మంత్రి బొత్స సత్యనారాయణ


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

జామి: రాష్ట్రంలో మళ్లీ ఏర్పడేది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమేనని మంత్రి బొత్స సత్యనారాయణ స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన జామి మండలంలోని కుమరాం గ్రామంలో గల శ్రీదేవి కన్వెన్షన్ హాల్‌లో జరిగిన వైఎస్సార్‌సీపీ మండలస్థాయి విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాలకు, రైతులు, అన్ని వర్గాలవారికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మేలు జరిగిందని చెప్పారు. బడుగు, బలహీన వర్గాలవారికి గౌరవం దక్కాలంటే జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం అవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయపడ్డారు. రైతులకు ప్రయోజనం కలిగే విధంగా రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి విత్తనాలు, ఎరువులతో పాటు రైతులు పండించిన ధాన్యం కొనుగోలు గ్రామాల్లోనే రైతు భరోసా కేంద్రాల ద్వారా జరిగిందని చెప్పారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతులకు ఒక్క రూపాయి బకాయి లేకుండా చెల్లించామని స్పష్టం చేశారు. విద్య, వైద్య రంగంలో సమూల మార్పులు తీసుకువచ్చినట్లు తెలిపారు. సుదీర్ఘరాజకీయాలు చేసిన తాను గతంలో ఏ ప్రభుత్వంలోనూ ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమం, అభివృద్ధి పాలనను చూడలేదని చెప్పారు. భీమసింగి సుగర్‌ఫ్యాక్టరీకి సంబంధించి ప్రస్తావిస్తూ రైతులకు గిట్టు బాటు ధర ఉన్న పంటలను పండిస్తారని, ఈ నేపథ్యంలో చెరకు సాగు విస్తీర్ణం తగ్గిందన్నారు. రైతులకు ప్రయోజనం కలిగించే విధంగా ప్రత్నామ్నాయ కర్మాగారం నెలకొల్పుతామని భరోసా ఇచ్చారు.


హాజరైన కార్యకర్తలు, నేతలు

ఇద్దరు ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలు

జామి మండలానికి ఇద్దరు ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలని వారి గెలుపు ఎంతో కీలకమన్నారు. ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, గజపతినరగం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, విశాఖ పార్లమెంట్ అభ్యర్థి బొత్స ఝాన్సీ, విజయనగరం పార్లమెంట్ అభ్యర్థి బెల్లాన చంద్రశేఖర్‌లకు ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. చిన్నచిన్న సమస్యలు పక్కన పెట్టి అందరూ కలిసికట్టుగా పనిచేసి పార్టీ విజయానికి పనిచేయాలని కోరారు. సమస్యలుంటే నేరుగా తాను పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు.

వైఎస్సార్‌సీపీపై దుష్ప్రచారం

ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు సమావేశంలో మాట్లాడుతూ టీడీపీ నేతలకు వారి హయంలో చేసిన మంచి లేకపోవడంతో వైఎస్సార్‌సీపీపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. వారికి దమ్ము, ధైర్యం ఉంటే ప్రజలకు చేసిన మంచి చెప్పాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గం పరిశీలకుడు తైనాల విజయ్‌కుమార్ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ముందు చూపుతో అనేక పథకాలు ప్రవేశపెట్టినట్లు చెప్పారు. టీడీపీ హయాంలో ఎటువంటి లబ్ధి పేదలకు జరగలేదని, రాబోయే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటేసి జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేయాలని కోరారు. సమావేశంలో జీసీసీ చైర్‌పర్సన్ శోభాస్వాతిరాణి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొర్లె రవికుమార్, ఎంపీపీ సబ్బవరపు అరుణ, జెడ్పీటీసీ గొర్లె సరయు, డీసీసీబీ డైరెక్టర్ పాండ్రంకి సంజీవి, రాష్ట్ర గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ సీహెచ్.సత్యారావు, మాజీ ఎంపీపీ కాకర్లపూడి సూకబాబురాజు, జేసీఎస్ ఇన్‌చార్జ్ శీరెడ్డి చందునాయుడు, పార్టీ జిల్లా కార్యదర్శి తోట మధుసూదనరావు, మండల యువజనవిభాగం అధ్యక్షుడు పిన్నింటి రవికుమార్, ప్రచార విభాగం అధ్యక్షుడు కంది నర్సింగరావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ యూరియా అప్పలనాయుడు, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు ఎ.సుబ్రహ్మణ్యం, పార్టీ నేతలు అల్లు పద్మ, జామి మేజర్ పంచాయతీ సర్పంచ్ చిప్పాడ లక్ష్మి, పలుగ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నేతలు తదితరులు పాల్గొన్నారు.

నడిరోడ్డుపై కూటమి నేతల ప్రెస్‌మీట్

- భారీగా ట్రాఫిక్ జామ్
- తిరగబడ్డ ప్రయాణికులు


రహదారి మధ్యలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశం

నెల్లిమర్ల రూరల్: జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ పర్యటన నేపథ్యంలో ఆ పార్టీ నెల్లిమర్ల ఎమ్మెల్యే అభ్యర్థి లోకం నాగమాధవి బుధవారం నెల్లిమర్ల మండల కేంద్రంలోని రామతీర్థం జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశం భారీగా ట్రాఫిక్ జామ్‌కు దారితీసింది. మీడియా సమావేశానికి కూటమిలో ఉన్న టీడీపీ, బీజేపీ నాయకులు హాజరు కాగా వాహనాలు రద్దీగా తిరుగుతున్న ప్రధాన రహదారి మధ్యలో ప్రెస్‌మీట్ పెట్టి వారు హంగామా సృష్టించడంతో రోడ్డు మధ్యలో సుమారు అరగంట పాటు భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. అసలే మండుటెండ కావడంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు. ప్రయాణికుల్లో కోపం కట్టలు తెంచుకోవడంతో కూటమి నాయకులపై తిరగబడ్డారు. భారీగా సౌండ్‌హార్న్ మోగించి నిరసన తెలియజేశారు. నడిరోడ్డు మీద ప్రెస్‌మీట్‌లు పెడతారా అంటూ తీవ్ర స్థాయిలో ప్రశ్నించారు. మండుటెండలో మమ్మల్ని ఇబ్బందులకు గురి చేస్తారా? బుర్రా, బుద్ధి లేదా అంటూ ఫైర్ అయ్యారు. మరికొంత మందైతే ఏకంగా బూతులతో విరుచుకుపడ్డారు. కూటమి నేతలు ఎదురు దాడికి ప్రయత్నించినప్పటికీ..ప్రయాణికుల ఆగ్రహం ముందు వెనక్కి తగ్గాల్సిన పరిస్థితి దాపురించింది. రహదారి మధ్యలో మీడియా సమావేశం ఏర్పాటుకు పోలీసుల పర్మిషన్ ఎలా ఇచ్చారని ప్రయాణికులు ప్రశ్నించారు. ఈ సమస్యను స్థానికులు పోలీసుల దృష్టికి తీసుకువెళ్లడంతో వారు అక్కడికి చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు.

సిక్కోలు రాజకీయ చరిత్ర పుస్తక ప్రదానం


మంచిపల్లికి పుస్తకాన్ని ప్రదానం చేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.జి.లీలాప్రసాదరావు

పార్వతీపురం: డా.బీఆర్. అంబేడ్కర్ విశ్వవిద్యాలయం (శ్రీకాకుళం) మీడియా సంబంధాల విభాగం సమన్వకర్త, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.జి.లీలాప్రసాదరావు 'సిక్కోలు రాజకీయ చరిత్ర' పుస్తకాన్ని రెడ్‌క్రాస్ పార్వతీపురం మన్యం జిల్లా చైర్మన్ డా. మంచిపల్లి శ్రీరాములుకు ప్రదానం చేశారు. ఈ మేరకు పార్వతీపురం పట్టణంలోని మంచిపల్లి శ్రీరాములు స్వగృహానికి వచ్చిన ఆయన 1920–2020 సంఘటనల ఆధారంగా తాను రచించిన పుస్తకాన్ని మంచిపల్లి శ్రీరాములకు అందజేయగా లీలా ప్రసాదరావును ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. జి.తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

బైక్, వ్యాన్ ఢీ: గిరిజనుడి మృతి


రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన సతీష్

సీతంపేట: మండలంలోని కె.గుమ్మడ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కురుపాం మండలంలోని వడ్డంగి పంచాయతీ కాకిలి గ్రామానికి చెందిన గిరిజనుడు కద్రక సతీష్ (30) అక్కడికక్కడే మృతి చెందాడు. వివాహశుభ కార్యానికి కీసరజోడు గ్రామానికి వెళ్లి ద్విచక్రవాహనంపై సతీష్ తిరిగివస్తుండగా బిల్లుమడ సెంటర్ వద్ద సీతంపేట నుంచి కొత్తూరు వెళ్తున్న మహీంద్ర పికప్ వ్యాన్ బలంగా ఢీకొట్టి రహదారి పక్కన ఉన్న చెట్టు వరకు దూసుకుపోయింది. దీంతో సతీష్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ప్రమాదంలో వ్యాన్‌డ్రైవర్ రామకృష్ణకు గాయాలయ్యాయి. మృతుడికి తల్లిదండ్రులు చిన్నాలమ్మ, చుంచులు ఉన్నారు. ఇంటికి పెద్దదిక్కు హఠాన్మరణంతో కుటుంబసభ్యులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై జగదీష్‌నాయుడు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు.

గుర్తు తెలియని వృద్ధుడు..


గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం

విజయనగరం క్రైమ్: స్థానిక జమ్ము గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయ వెనుక భాగంలో గుర్తు తెలియని వృద్ధుడు మృతిచెందినట్లు స్థానికులు గుర్తించి, రూరల్ పోలీసులకు సమాచారమిచ్చారు. ఈ మేరకు పోలీసులు వచ్చి పరిశీలించి వృద్ధుడికి సుమారు 65 ఏళ్ల వయస్సు ఉంటుందని, నీలం రంగు నిక్కర్, నలుపు రంగు టీ షర్ట్ ధరించి ఉన్నాడని చెప్పారు. చనిపోయి రెండు, మూడురోజులై ఉండవచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతదేహాన్ని జిల్లా కేంద్రాస్పత్రికి తరలించామని, ఎవరైనా గుర్తిస్తే రూరల్ ఎస్సై ఫోన్ 9121109441 నంబర్‌కు సమాచారమందించాలని కోరారు.

ఎస్సీ, ఎస్టీలకు విద్యుత్ వెలుగులు

- ఉచితంగా విద్యుత్ అందిస్తున్న ప్రభుత్వం
- ఐదేళ్లలో లబ్ధిపొందిన ఎస్సీలు 2,60,165 మంది
- ఎస్టీలు 1,91,745 మంది



విజయనగరం ఫోర్ట్: ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు పూజారి రాములమ్మ. ఈమెది కొండపర్తి గ్రామం. నిరుపేద కుటుంబం. 2019 నుంచి ఇప్పటి వరకు ఈమెకు ప్రభుత్వం విద్యుత్ రాయితీ ఇస్తోంది. నెలకు 50 యూనిట్ల వరకు విద్యుత్‌ను ఈ కుటుంబం వినియోగిస్తోంది. ఈ నేపథ్యంలో ఏడాదికి రూ.2 వేల నుంచి రూ.2100 వరకు ప్రభుత్వం ఆమె వినియోగించిన ఉచిత విద్యుత్‌కు వెచ్చిస్తోంది.



ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు పారపు అప్పలకొండ. బాడవ గ్రామం. ఈమె నెలకు 50 నుంచి 80 వరకు యూనిట్లు విద్యుత్ వినియోగిస్తోంది. ఐదేళ్లుగా ఆమె వినియోగించిన విద్యుత్‌కు ప్రభుత్వమే డబ్బులు చెల్లిస్తోంది.

ఇలా వీరిద్దరికే కాదు. అనేక మంది ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ అందిస్తోంది. దీని వల్ల వారికి ఎంతగానో ఊరట కలుగుతోంది. జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టింది. పథకాలన్నీ పేద, మధ్య తరగతి ప్రజలకు మేలు చేసేవే. అవినీతి, సిఫార్సులకు తావు లేకుండా సంక్షేమ పథకాలను నేరుగా లబ్దిదారులకు అందించింది. ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్ పథకాన్ని జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అమలు చేసి వారిళ్లలో విద్యుత్ వెలుగులు నింపింది.


గంట్యాడ మండలంలోని పెదవేమలిలో ఎస్సీ లబ్ధిదారుని ఇంట్లో వెలుగుతున్న ఎల్ఈడీ బల్బు

200 లోపు యూనిట్లు వినియోగించిన వారికి ఉచితం

నెలలో 200 లోపు యూనిట్ల విద్యుత్ వినియోగించే ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ అందిస్తోంది. జిల్లాలో 90 శాతం మంది ఎస్సీ, ఎస్టీలు నిరుపేదలే. వారంతా ఈ పథకం లబ్ధి పొందుతున్నారు. ఉచితంగా విద్యుత్ అందించడం వల్ల ఆయా వర్గాలు ఎంతోగానో ఆనందపడుతున్నాయి. గతంలో కొంతమందికి విద్యుత్ సౌకర్యం ఉండేదికాదు. విద్యుత్ బిల్లులు కూడా చెల్లించే పరిస్థితి లేకపోవడంతో మీటర్ పెట్టుకునేవారు కాదు. ప్రస్తుతం ప్రభుత్వం ఉచితంగా ఇస్తుండడంతో విద్యుత్ సౌకర్యాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకుంటున్నారు.

ఐదేళ్లలో 2,60,165 ఎస్సీలకు లబ్ధి

గడిచిన ఐదేళ్ల కాలంలో 2019 నుంచి ఇప్పటివరకు ఎస్సీలు 2,60,165 మందికి ఉచిత విద్యుత్ లబ్ధి చేకూరింది. ఐదేళ్లలో వారంతా 20,47,81,765 యూనిట్ల విద్యుత్ వినియోగించారు. అదేవిధంగా ఎస్టీలకు సంబంధించి 2019 నుంచి ఇప్పటి వరకు 1,91,745 మంది లబ్ధిదారులు పొందారు. ఐదేళ్ల కాలంలో వారంతా 10, 19,77441 యూనిట్ల విద్యుత్ వినియోగించారు.

రూ. 4 వేల నుంచి రూ.5 వేల వరకు లబ్ధి

ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చిన ఉచిత విద్యుత్ వల్ల ఒక్కో లబ్ధి దారుకు ఏడాదికి రూ. 4 వేల నుంచి రూ.5 వేల వరకు లబ్ధిచేకూరుతోంది. ఐదేళ్లలో ఎస్సీలకు ఉచిత్ విద్యుత్‌కు రూ.100 కోట్ల నుంచి రూ.120 కోట్లు వరకు ప్రభుత్వం వెచ్చించింది. అదే విధంగా ఎస్టీలకు రూ.76 కోట్ల నుంచి రూ. 90 కోట్లు వరకు వెచ్చించింది.

వైభవంగా ఆంజనేయస్వామి తీర్థం

వేపాడ: మండలంలోని బొద్దాం గ్రామంలో శ్రీఆంజనేయస్వామి తీర్థమహోత్సవం బుధవారం ప్రారంభమైంది. గ్రామ పురోహితుడు బొడ్డపాటి హరిశర్మ మంత్రోచ్చారణతో స్వామివారికి అష్టోత్తర శత నామాలతో పూజలు నిర్వహించారు. భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

ఆకట్టుకున్న ఎడ్ల పరుగు ప్రదర్శన


ప్రదర్శనలో పరుగు తీస్తున్న ఎడ్లు

వేపాడ: మండలంలోని వల్లంపూడి గ్రామంలో నిర్వహించిన ఎడ్ల పరుగు ప్రదర్శన ఆకట్టుకుంది. గ్రామంలో ఇంటమ్మతల్లి అమ్మవారి పండగ సందర్భంగా శెట్టిబలిజ యూత్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం ఎడ్ల పరుగు ప్రదర్శన నిర్వహించారు. ఈ పోటీల్లో 15 జతల ఎడ్లు పాల్గొన్నాయి. వాటిలో వల్లంపూడికి చెందిన శానాపతి నాయుడు ఎడ్లు ప్రథమస్థానంలో నిలిచి రూ.15 వేలు కైవసం చేసుకున్నాయి. తర్వాత స్థానాల్లో నిలిచిన ఎడ్లకు రూ.12,10, 8 వేలు చొప్పున నగదు బహుమతులను ఉత్సవ కమిటీ సభ్యులు అందజేశారు. గురువారం అమ్మవారి పండగ వైభవంగా నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

ఘనంగా వేమాలమ్మ అమ్మవారి ప్రతిష్ట


ఎం.శింగవరంలో ప్రతిష్ఠించిన వేమాలమ్మ విగ్రహం

వేపాడ: మండలంలోని బానాది పంచాయతీ ఎం.శింగవరం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో వేమాలమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం బధవారం వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణాలతో ఆలయ శిఖరం ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ ప్రత్యేక పూజలు, భక్తుల దర్శనం అనంతరం అన్నసమారాధన నిర్వహించారు.

5న అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట

బొండపల్లి: మండలంలోని అంబటివలస గ్రామంలో సంతోషిమాత ఆలయం ఆవరణలో నూతనంగా నిర్మించిన భారీ అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టా మహోత్సవాన్ని ఈనెల5న ఘనంగా నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా విగ్రహప్రతిష్ఠ అనంతరం భారీ అన్న సమారాధన చేపట్టనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

ప్రత్యేక అలంకరణలో నూకాలమ్మ


భక్తులకు దర్శనమిస్తున్న నూకాలమ్మ అమ్మవారు

విజయనగరం టౌన్: స్థానిక మంగళవీధిలో కొలువైన శ్రీ నూకాలమ్మ అమ్మవారు బుధవారం భక్తులకు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. అమ్మవారి జాతర మహోత్సవాలను పురస్కరించుకుని వేకువజాము నుంచి అమ్మవారి ఉత్సవ విగ్రహానికి విశిష్ట అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించారు. రాత్రి 9 గంటలకు ఆలయ ప్రాంగణంలో చీపురుపల్లికి చెందిన శ్రీ సరస్వతి కళా బృందం డీవీవీ జగన్నాథరావు పంతులు ట్రూప్‌చే నిర్వహించిన శ్రీ సత్యభామా కలాపం భాగవతం ఆద్యంతం ఆహుతులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన సిరిమాను సంబరం


సిరిమాను సంబరంలో పూజారితో కలిసి నడుస్తున్న యువత


సిరిమానును అధిరోహించిన పూజారి


కొట్టాంలో సిరిమాను సంబరాన్ని చూసేందుకు బారులు తీరిన జనం

శృంగవరపుకోట: మండలంలోని కొట్టాం గ్రామంలో వెలసిన కోటమ్మ తల్లి అమ్మవారం సిరిమాను సంబరం అంబరాన్ని తాకింది. గ్రామంలో అమ్మవారి పండగను మూడు రోజుల పాటు వైభవంగా నిర్వహించారు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం గ్రామంలో ఏర్పాటు చేసిన సిరిమాను సంబరాన్ని చూసేందుకు వచ్చిన జనంతో ఊరంతా కిటకిటలాడింది. గ్రామంలో ఎటు చూసినా జనహోరు కనిపించింది. ముందుగా గ్రామంలో అమ్మవారి గద్దె ఇంటి దగ్గర పూజాకార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సిరిమానుకు ముందు మొలమాను సిద్ధం చేశారు. తర్వాత గ్రామంలోని మత్స్యకారులంతా రోలుతో కలిసి రోటి పచ్చడికి సిద్ధమయ్యారు. మత్స్యకారులంతా రోటిలో వేసినవి దంచుతూ సిరిమాను వద్దకు వెళ్లి పూజలు చేశారు. తర్వాత సిరిమానుకు ప్రదక్షిణ చేసి, పూజారిని ఎక్కించారు. సాయంత్రం 6గంటల సమయంలో ఏర్పాటు చేసిన రథంపై పూజారిని అధిరోహింప చేశారు. సిరిమాను గ్రామంలోని ప్రధానవీధిలో కదులుతుండగా జనం బారులు తీరి సిరిమాను సంబరాన్ని వీక్షించారు. కోటమ్మ తల్లీ కాపాడమ్మా అంటూ నినాదాలు చేశారు. గ్రామస్తులంతా సంబరాల్లో మునిగి తేలడంతో ఊరంతా కోలాహలంగా మారింది.